సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 16 । జూన్ । 2025



విత్తనాలు సిద్ధం..
రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా యూనిట్ వరి, అపరాల విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. 8లో



పూర్వవైభవం వచ్చేనా?
ఒక్కొక్కటిగా కార్యాలయాలు, కర్మాగారాలు తరలిపోతుండటంతో పాల్వంచ అభివృద్ధిపై నీలినీడలు అలుముకుంటున్నాయి. 8లో



వాతావరణం
జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో రాష్ట్రవ్యాప్తంగా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో రైతులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమ ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నందున సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేయడానికి కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ సూచించారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో ఆదివాసీ గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ శ్యాచురేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీడీఏ పరిధిలోని 19 మండలాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. వీటిల్లో ఆధార్, కుల ధ్రువీకరణ, ఓటర్ గుర్తింపు, రేషన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, కిసాన్ సమ్మాన్ నిధి యోజన, ఆయుష్మాన్ భారత్, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, జన్‌ధన్, ఎన్ఆర్ఈజీఎస్ కార్డులను అర్హులకు అందిస్తారని వివరించారు. ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ముమ్మరంగా ప్రచారం చేసేందుకు కోయ, లంబాడా భాషల్లో కూడా వాల్ పోస్టర్లు ముద్రించినట్లు తెలిపారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించి సందడి చేశారు. మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రకృతి అందాల నడుమ ఉత్సాహంగా గడిపారు. 599 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.33,145 ఆదాయం లభించింది. 400 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.22,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

లౌక్యకు నాట్యమయూరి అవార్డు



చిన్నారి లౌక్యకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

మణుగూరు టౌన్: మండలానికి చెందిన చింతలపూడి లౌక్యను నాట్యమయూరి అవార్డు వరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జానపద కూచిపూడి నృత్య సంబరాల ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో లౌక్య ప్రతిభ చూపగా, నాట్య మయూరి అవార్డును అందజేశారు. కాగా చిన్నారి ఐదో తరగతి చదువుతుండగా, వరంగల్, హనుమకొండ, జమ్మికుంట ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా చిన్నారిని పలువురు అభినందించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ దిశగా..



స్పోర్ట్స్ కాంప్లెక్స్ నమూనా చిత్రం

కొత్తగూడెంలో ఏర్పాటుకు అడుగులు
- 50 ఎకరాల్లో రూ.25 కోట్లతో ప్రణాళిక
- నిర్మాణం జరిగితే క్రీడాభివృద్ధిలో కీలక మైలురాయి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఉన్నత ప్రమాణాలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. జాతీయస్థాయి క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా, స్థానికుల్లో క్రీడా నైపుణ్యాలు పెంచేందుకు అవసరమైన మౌలిక వసతులతో నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గానికి ఒకటి వంతున స్టేడియం, మినీ ఇండోర్ స్టేడియాలను నిర్మించేందుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇల్లెందులో సగానికి పైగా పనులు జరిగి ఆగిపోగా, పాల్వంచలో ఇండోర్ స్టేడియం సిద్ధమైంది. మిగిలిన చోట్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇవి కాకుండా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ప్రాంతాల్లో క్రీడా మైదానాలు ఉన్నాయి. భద్రాచలంలో జూనియర్ కాలేజీ గ్రౌండ్ ఒక్కటే అన్ని కార్యక్రమాలకు దిక్కుగా మారింది. జిల్లా కేంద్రంలో ప్రగతి మైదాన్, సాధన గ్రౌండ్స్ (రామవరం), శ్రీరామచంద్ర డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్ ఉన్నాయి. ఎక్కడ కూడా ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలు ఒకే చోట ఆడుకునేలా, స్పోర్ట్స్, గేమ్స్‌కు అనువుగా మైదానాలు లేవు. ఈ లోటును తీర్చేందుకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.

50 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదనలు

బొగ్గు తవ్వకాల కోసం నైజాం జమానాలోనే సింగరేణి వందలాది ఎకరాలను లీజుకు తీసుకుంది. ఇందులో చాలా భూములను బొగ్గు తవ్వకాలు, క్వార్టర్లు, కార్యాలయాల నిర్మాణాలు వంటి అవసరాలకు ఉపయోగించుకుంది. అయినప్పటికీ పెద్ద ఎత్తున భూములు సింగరేణి ఆధీనంలో నిరుపయోగంగా ఉన్నాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం కొత్తగూడెం ఏరియా పరిధిలో నిరుపయోగమైన భూముల్లో 50 ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇప్పటికే సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ప్రస్తుతం ఈ ఫైలు తుది పరిశీలన దశలో ఉంది. జిల్లా కేంద్రం చుట్టుపక్కల స్థలాన్ని ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

గతంలో ఘనంగా..

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఒకప్పుడు రంజీ మ్యాచ్‌లు నిర్వహించారు. భద్రాచలంలో జరిగే భద్రాద్రి క్రికెట్ టోర్నమెంట్‌కు ఒకప్పుడు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉండేది. వెయిట్ లిఫ్టింగ్‌లో ఇల్లెందు క్రీడాకారులు ఇప్పటికీ జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నారు. అయితే 2000 సంవత్సరం తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో జిల్లా వెనకబడిపోయింది. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఇచ్చిన ఊపులో వేర్వేరు క్రీడాంశాల్లో అనేక లీగ్‌లు తెర మీదకు వచ్చాయి. నిరంతరం పోటీలు జరుగుతున్నాయి. ద్వితీయశ్రేణి పట్టణాల్లో నూ డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే ఈ విషయంలో 'భద్రాద్రి కొత్తగూడెం' వెనకబడిపోయింది.

వివిధ క్రీడలకు అనువుగా..

యాభై ఎకరాల స్థలం కేటాయింపు జరిగితే కనీసం పదిహేను ఎకరాల విస్తీర్ణంలో ప్రధానంగా స్టేడియం నిర్మించే ఆలోచనలో ఉన్నారు. ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, ఫుట్‌బాల్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్ ట్రాక్స్, యోగా సెంటర్, జిమ్, ట్రెనింగ్ సెంటర్ తదితర మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని సంకల్పించారు. కాంప్లెక్స్ నిర్మాణానికి కనీసం రూ.25 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నారు. నిధుల కొరత ఎదురైతే డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, సీఎస్సార్ ఫండ్స్, వామపక్ష ప్రభావిత ప్రాంత అభివృద్ధి ప్రత్యేక నిధులను కూడా ఉపయోగించే అవకాశం పరిశీలించనున్నారు.

ఒక్కొక్కటిగా..

ఇటీవల కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడయింది. యూనివర్సిటీ మంజూరైంది. మెడికల్ కాలేజీ విజయవంతంగా నడుస్తోంది. ఆర్గానిక్ ఫార్మింగ్‌లో నేషనల్ లెవల్ ఎక్సలెన్స్ సెంటర్ రానుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం సుముఖంగా ఉంది. దీంతో జిల్లా కేంద్రంలో క్రీడల సౌకర్యాల విషయంలో నెలకొన్న లోటు తీరుస్తూ మారిన పరిస్థితులకు తగ్గట్టుగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నారు.

ప్రయత్నాలు మొదలు పెట్టాం

నోటిఫైడ్ ఏరియాగా ఉన్న కొత్తగూడెం పట్టణానికి మున్సిపాలిటీ హోదా, రైల్వే అండర్ బ్రిడ్జి, ముర్రేడుపై హైలెవల్ వంతెన, కిన్నెరసాని తాగునీరు వంటి అంశాలపై తొలిసారిగా డిమాండ్ తెరపైకి తెచ్చింది, నిరంతర ఉద్యమాలను తొలిసారిగా చేసింది నేనే. కమ్యూనిస్టు ఉద్యమ నేతగా ప్రజల అవసరాల కోసం చేసిన ప్రతిపాదనలు తర్వాత కాలంలో సాకారమయ్యాయి. అదే విధంగా కొత్తగూడెంలో క్రీడా అవసరాల కోసం స్టేడియం కట్టడానికి ప్రయత్నాలు మొదలెట్టాం.

– కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే, కొత్తగూడెం

రైతు భరోసా రెడీ..



పత్తి గింజలు వేస్తున్న కూలీలు



- నేటి నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం
- జిల్లాలో 1.87 లక్షల మంది రైతులకు లబ్ధి
- అందనున్న రూ.331.97 కోట్ల పెట్టుబడి సాయం

బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయమందించేందుకు రంగం సిద్ధం చేసింది. సోమవారం నుంచి బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నగదు జమచేయనుంది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం 4 గంటలకు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడనున్నారు. వ్యవసాయ సీజన్ ఆరంభంలో భరోసా అందనుండటంతో రైతులకు ఉపయోగకరంగా మారనుంది.

గతేడాది అందనిసాయం

గత వానాకాలం సీజన్‌లో రైతు భరోసా అందక పంటల సాగు పెట్టుబడులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రుణమాఫీపై ఫోకస్ చేసిన ప్రభుత్వం రైతు భరోసాను పక్కకు పెట్టింది. యాసంగిలో కూడా పూర్తిస్థాయిలో అందించలేదు. గత జనవరి 26 నుంచి దశలవారీగా నాలుగెకరాల లోపు పట్టా భూములున్న రైతులకు మాత్రమే అందించింది. అంతకు మించి భూములున్న రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కూడా రైతు భరోసా వస్తుందో రాదోననే ఆందోళనలో ఉన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన ఊరటనిచ్చింది.

5.53 లక్షల ఎకరాలకు..

జిల్లాలో వానాకాలం వ్యవసాయ సీజన్‌లో పట్టా భూములు, అటవీ హక్కులు కలిగిన భూములకు మొత్తంగా 5.53 లక్షల ఎకరాలకు సంబంధించి 1,87,839మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. రూ. 331.97 కోట్లను రైతు భరోసా కింద అందించనున్నారు. సోమవారం నుంచి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి వారం రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా వ్యవసాయ అధికారులు ఇప్పటికే రైతు భరోసా అర్హుల జాబితాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బ్యాంకు ఖాతాల్లో మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసి నివేదిస్తున్నారు.

పెట్టుబడులకు వినియోగిస్తాం



ప్రభుత్వం ఇప్పుడు రైతు భరోసా అందించటం ఆనందంగా ఉంది. ఈ డబ్బులతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకుంటాం. ఎకరానికి రూ 6 వేల సాయంతో కొంత ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రస్తుతానికి ప్రైవేటు అప్పులు చేయాల్సి పనిలేదు. –గొగ్గెల లక్ష్మీనారాయణ, రైతు, గుండాల

సాయం అందనుంది



రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం పంటల సాగు కోసం రైతు భరోసా అందించనుంది. జిల్లాలో 1.87లక్షల మంది రైతులకు రూ 331.97 కోట్ల నగదును ఖాతాల్లో జమ చేయనుంది. పట్టా, ఆర్ఓఎఫ్ఆర్ భూములకు సాయం అందనుంది.

–వి.బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

సరిహద్దుల్లో ఇసుక దందా!



దమ్మపేట పోలీసులు సీజ్ చేసిన ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఇసుక లారీలు (ఫైల్)

- మా వద్దే కొనాలని దళారుల బెదిరింపులు
- లేకపోతే లారీలు సీజ్ చేయిస్తామంటూ అక్రమంగా వసూళ్లు
- ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో మూడు నెలలుగా దందా
- పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల తీరుపై విమర్శలు

దమ్మపేట : 'కొంటె మా ఇసుకే కొనాలి. లేకుంటే మీరు తెచ్చుకున్న ఇసుక వాహనాలను, ఇసుకను సీజ్ చేయిస్తాం.' అంటూ దళారులు సామాన్యులను బెదిరిస్తున్నారు. కొందరు వ్యక్తులు ఆంధ్రా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దమ్మపేట తదితర ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లతో పాటు సామాన్యుల ఇంటి నిర్మాణాలకు కొందరు ఆంధ్రాలోని రాజమండ్రి నుంచి గోదావరి ఇసుక తెప్పించుకుంటున్నారు. గతంలో తెలంగాణలో ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేకపోవడంతో ఇంటి నిర్మాణదారులు అటువైపు ఇసుక తెప్పించుకున్నారు. అనుమతులు లేని కారణంగా అడపాదడపాగా పోలీసులు తనిఖీలు చేపట్టి కేసులు కూడా నమోదు చేశారు. ప్రస్తుతం జిల్లాలో మణుగూరులో రీచ్‌లకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడంతో ఇసుక తోలకాలను ప్రారంభించారు. కానీ ఆంధ్రా ప్రాంతానికి చెందిన గోదావరి ఇసుక తెలంగాణలో కంటే తక్కువ ధరకు రావడంతో ఎక్కువమంది అటువైపు నుంచే ఇసుక తెప్పించుకుంటున్నారు. ఇదే అదునుగా దళారులు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి వేళల్లో లారీలను అడ్డుకుని, సీజ్ చేయిస్తామని భయభ్రాంతులకు గురిచేస్తూ, లారీకి రూ. రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు అనధికారికంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉద్యోగి ఒకరు ఇసుక వాహనాలను అడ్డుకుంటూ, సహకరిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇసుక తమ ద్వారానే కొనాలని, లేకపోతే పోలీసులు, ఫారెస్ట్ అధికారుల ద్వారా సీజ్ చేయిస్తామని బెదిరించి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో వినియోగదారులు వారినే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికారుల నిఘా ఏదీ..?

అర్ధరాత్రి వేళ మండలానికి శివారులో ఉన్న ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో ఒకరిద్దరు దళారులు పోలీసుల మాదిరిగా గస్తీ తిరుగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రాలోని దళారులతో కలిసి ఇసుక రవాణా చేస్తూ ఒక్కో లారీ ఇసుకపై రూ.10,000 వరకు సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. సరిహద్దుల్లో మూడు నెలలుగా అర్ధరాత్రి వేళల్లో ఇసుక దందా సాగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదు. వీరికి సహకరిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఇప్పటికైనా మేల్కొని సరిహద్దుల్లో సాగుతున్న దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



ఇంటి నిర్మాణాల కోసం తెచ్చుకుంటున్న ఇసుక లారీలను అడ్డుకుని, సామాన్యులను ఇబ్బంది పెట్టడం సరికాదు. ఇసుకను తక్కువ ధరలో అందరికీ అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దందాకు పాల్పడుతున్న వారిపై కూడా చర్యలు చేపట్టాలి.

–చెక్కిరాల మల్లేశ్వరరావు, దమ్మపేట

నా దృష్టికి రాలేదు



ఇసుక లారీలను అడ్డుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్న విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి రాత్రి వేళల్లో నిఘా పటిష్టం చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

–సాయికిషోర్ రెడ్డి, దమ్మపేట ఎస్సై

ప్రజలతో మమేకం.. పథకాలు చేరువగా..

- ఆర్థికాభివృద్ధి సాధించేలా రైతులకు ప్రోత్సాహం
- పర్యాటకాభివృద్ధితో స్థానికులు ఆదాయం పొందేలా కృషి
- జితేష్ వి.పాటిల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది



రైతులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ జితేష్(ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): జితేష్ వి.పాటిల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది పూర్తికానుంది. 2014, జూలై 16న బాధ్యతలు స్వీకరించిన ఆయన ప్రజలతో మమేకమవుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తున్నారు. పేద ప్రజలకు విద్య, వైద్యం అందేలా శ్రద్ధ చూపుతూనే ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారు. వ్యవసాయంపై మక్కువ చూపుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలంటే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని రైతులకు స్వయంగా అవగాహన కల్పిస్తున్నారు. మునగ సాగు, పెరటికోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు వంటి వాటిపై రైతులను చైతన్యం చేస్తూ సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచిస్తున్నారు. చేపల పెంపకం చెరువుల ద్వారానే కాకుండా సాగుభూములలో ఫామ్‌పాండ్‌లలో కూడా చేపల పెంపకం, అంతరపంటల ద్వారా ఆదాయ వనరులు ఏర్పరుచుకోవాలని చెబుతున్నారు. భద్రాచలంలో గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ట్రైబల్ హట్స్ ఏర్పాటు చేయించారు. చంద్రుగొండలో కనకగిరి గుట్టల్లో పర్యాటకానికి, అశ్వాపురం మండలం తుమ్మల చెరువులో బోటింగ్‌కు నాంది పలికారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణపైనా దృష్టి పెట్టారు. మారుమూల గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యంపై శ్రద్ధ పెట్టడంతోపాటు పర్యావరణ పరిరక్షణ, ఔషధ మొక్కల పెంపకానికి కృషి చేస్తున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం ఉద్యమంలా చేపట్టి జిల్లా దేశంలోనే మొదటిస్థానంలో నిలిచేలా పాటుపడుతున్నారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

వంతెన అంతేనా..?



స్లూయిజ్‌లకు గేట్లను అమరుస్తున్న కార్మికులు



కరకట్ట వద్ద కొనసాగుతున్న పనులు

- ఇంకా డిజైన్ ఆమోదం పొందని గోదావరి కరకట్ట బ్రిడ్జి
- భద్రాచలంలో వేగంగా సాగుతున్న రాక్టో, బర్మ్ పనులు
- వరదలు సాధారణ స్థాయిలో ఉంటే ముంపు కాలనీలకు రక్షణ

భద్రాచలం: గోదావరి వరదల నుంచి పట్టణంలోని సుభాష్‌నగర్ పరిసర ప్రాంత కాలనీలను ముంపు నుంచి కాపాడేందుకు కూనవరం రోడ్డులో చేపట్టిన కరకట్ట పనులు పూర్తవుతున్నా కానీ బ్రిడ్జి పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అప్రోచ్ రోడ్, బ్రిడ్జి డిజైన్‌ను జాతీయ రహదారుల శాఖ ఆమోదించకపోవడంతో జాప్యం జరుగుతోంది. దీంతో ఈ ఏడాది వర్షాకాల సీజన్‌కు కరకట్టకు బ్రిడ్జి పూర్తయ్యే పరిస్థితిలేదు. అయితే వరదలు సంభవించినా ముంపు కాలనీలకు ప్రమాదం లేకుండా ఇరిగేషన్ అధికారులు పనులు చేపడుతున్నారు. గోదావరి వరదలు సాధారణస్థాయిలో ఉంటే ముంపు కాలనీలకు రక్షణ ఉంటుందని చెబుతున్నారు.

ఓవర్ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు, ఇతర పనులకు రూ.100 కోట్లు?

ఇటీవల హైదరాబాద్‌కు చెందిన రూకే అనే ప్రైవేట్ సంస్థ రూపొందించిన ఓవర్ బ్రిడ్జి డిజైన్‌ను అధికారులు ఆమోదించారు. ఫైనల్ చేసేందుకు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ శాఖకు పంపగా, అక్కడ ఆమోదించాల్సి ఉంది. కరకట్ట పొడిగింపునకు ప్రభుత్వం కేవలం రూ. 38 కోట్లను మాత్రమే విడుదల చేయగా, ఇప్పుడు ఆమోదించిన డిజైన్, ఇతర పనులకు సుమారు రూ. 100 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నిధుల విడుదలయ్యాకే పనులు ప్రారంభవుతాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమయ్యేలా లేదు. కాగా ఇక్కడి బ్రిడ్జి కొత్తగూడెం, సుజాతనగర్ మధ్యలో నిర్మించిన ఆర్వోబీ తరహాలో ఉండనుంది.

సాధారణ వరదలకు సేఫ్

ఓవర్ బ్రిడ్జి పనులు ఆగిపోయినా ఇతర కరకట్ట పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. కరకట్టకు రాళ్లతో రాక్టో పనులను పూర్తి చేస్తున్నారు. స్లూయిజ్ నిర్మాణాలను పూర్తి చేసి గేట్లను బిగించారు. మరోవైపు కరకట్టకు అవతలి వైపున మూడు మీటర్ల వెడల్పుతో బర్మ్ నిర్మాణం చేపట్టాలని భావించారు. ఇందుకోసం 21 మంది రైతుల నుంచి భూ సేకరణ చేపట్టనున్నారు. ఇది సైతం కలెక్టర్ వద్ద ఆమోదం పొందే దశలో ఉంది. అవసరమైన గ్రావెల్ ఏపీలోని చోడవరం నుంచి తరలించాల్సి ఉండగా, అనుమతి కోసం ఐటీడీఏ పీఓకు దరఖాస్తు చేశారు. అనుమతులు రాగాన్ బర్మ్ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే చేపట్టిన పనులతో గోదావరి వరదలు 34 అడుగుల మేర వచ్చినా చుక్క నీరు ముంపు కాలనీల్లోకి ప్రవేశించే అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు. 54 అడుగులకు మాత్రమే జాతీయ రహదారిపై వరద నీరు వస్తుందని, ఆ సమయంలో అత్యవసర రోడ్డును తాత్కాలిక పద్ధతిన మూసివేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు.

రెండేళ్లుగా సాగుతున్న కరకట్ట పనులు

గోదావరి వరదల నుంచి కాపాడేందుకు 2000 సంవత్సరంలో కరకట్ట నిర్మించగా, కూనవరం రోడ్డుకు ఇరువైపులా 700 మీటర్ల మేర పనులు ఆగిపోయాయి. ఆ పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రూ. 38 కోట్లను ప్రకటించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధి దృష్ట్యా నిధులు విడుదల చేసి పనులు చేపట్టింది. పనులు 2024 జూన్ నాటికే పూర్తి కావాల్సి ఉన్నా ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఇక విజయవాడ- జగదల్‌పూర్ జాతీయ రహదారిపై నిర్మించాల్సిన ఓవర్ బ్రిడ్జి పీటముడిగా మారింది. మట్టి శాంపిల్స్ టెస్టులు, పలుమార్లు డిజైన్లను పరిశీలించాక ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

డిజైన్ ఆమోదం పొందగానే.



ఓవర్ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్ డిజైన్‌ను సీడీఓకు పంపించాం. అనుమతి, బడ్జెట్ ఆమోదం కాగానే పనులను ప్రారంభిస్తాం. గోదావరి వరదలు సాధారణ స్థాయిలో వచ్చినా ముంపు కాలనీలకు రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టాం.

–సయ్యద్ అహ్మద్ జానీ, భద్రాచలం ఇరిగేషన్ ఈఈ,

క్లుప్తంగా

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వేసవి సెలవుల చివరి ఆదివారం కావడంతో నిత్యకల్యాణ వేడుకలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ కనకదుర్గ అమ్మవారికి విశేష పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో సందడి నెలకొంది. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీ పరిశీలకుడిగా కృష్ణ


నియామకపత్రం అందుకుంటున్న కృష్ణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ స్క్రూటినైజింగ్ సభ్యుడిగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాది యర్రపాటి కృష్ణను నియమిస్తూ చైర్మన్, జిల్లా జడ్జి వసంత్ పాటిల్ ఉత్తర్వులు జారీచేశారు. కృష్ణ నియామకంపై జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జనపరెడ్డి గోపికృష్ణ, కోశాధికారి కనకం చిన్నికృష్ణ, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

విత్తనాలు సిద్ధం..

అందుబాటులోకి వరి, అపరాల సీడ్స్
- వరిలో జీపీటీ, కేఎన్‌ఎం సన్న రకాలు
- అపరాలలో పెసర, మినుములు రెడీ


పెసల విత్తన బ్యాగులు


ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థలో నిల్వ ఉన్న వరి విత్తనాలు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా యూనిట్ వరి, అపరాల విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. వానాకాలం సీజన్ ప్రారంభం కావటంతో తొలుత మెట్ట పంటలు, ఇదే క్రమంలో వరి సాగుకు అవసరమైన విత్తనాలను సంస్థ సిద్ధం చేసింది. ప్రభుత్వం వరిలో విదేశీ డిమాండ్ ఉన్న సన్న రకాలను ప్రోత్సహిస్తోంది. అంతేగాక సన్న రకాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా ఇస్తోంది. దీంతో రైతులు కూడా వరి సాగులో సన్న రకాలకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ జిల్లాల వారీగా నీటి వనరులు, నేలల రకాలు, వ్యవసాయ శాఖల ఇండెంట్ల ఆధా రంగా వరిలో సన్న రకాలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బీపీటీ 5204 రకంతో పాటు కేఎన్‌ఎం 1638 రకాన్ని సిద్ధం చేశారు. ఇక మెట్ట పంటలుగా సాగు చేసే పెసర, మినుము విత్తనాలను కూడా సంస్థ అందుబాటులో ఉంచింది. విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు.

షరతులతో కూడిన రాయితీ

వరి విత్తనాలకు విత్తనాభివృద్ధి సంస్థ ఓ ఆఫర్ ప్రకటించింది. ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థ యూనిట్ కార్యాలయం (గోదాం) నుంచి రైతులు నేరుగా విత్తనాలను కొనుగోలు చేస్తే వారికి విత్తన ధరలో 6 శాతం రాయితీ ప్రకటించింది. అంతేగాక రైతులు సమూహంగా ఏర్పడి 2 టన్నుల విత్తనాలను ఆర్డర్ చేస్తే దానికి కూడా 6 శాతం డిస్కౌంట్ కల్పించారు. ఎలాంటి రవాణా చార్జీలు లేకుండా ఆయా గ్రామాలకు సంస్థ విత్తనాలను రవాణా చేసే సౌకర్యం కల్పించింది.

రైతులకు అందుబాటులో..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వరిలో బీపీటీ 5204, కేఎన్‌ఎం 1638 సన్న రకాల విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని విత్తన విక్రయ కేంద్రాల్లో బీపీటీ 5204 రకం 2,943 క్వింటాళ్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 807 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. కేఎన్‌ఎం 1638 రకం ఖమ్మం జిల్లాలోని విక్రయ కేంద్రాల్లో 187 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. ఖమ్మం జిల్లాలో పెసలు ఎంజీజీ 295 రకం 10 క్వింటాళ్లు, ఎంజీజీ 385 రకం 130 క్వింటాళ్లు, మినుములు బీజీ పీయూ–31 రకం 35 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. ఇవిగాక ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థ యూనిట్‌లో బీపీటీ 5204 రకం వెయ్యి క్వింటాళ్లు, కేఎన్‌ఎం 1638 రకం 180 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి.

విత్తన ధరలు (రూ.లలో)

వరి	కిలోలు	రైతు ధర
జీపీటీ 5204	25	950.00
కేఎన్‌ఎం 1638	25	950.00
పెసలు ఎంజీజీ–295	4	506.00
పెసలు ఎంజీజీ–385	4	506.00
మినుములు పీయూ–31	4	463.00

డిమాండ్ ఆధారంగా విత్తనాలు



వానలు కురుస్తున్న వేళ విత్తన సీజన్ ప్రారంభమైంది. రైతులు సాగు చేసే పంటల ఆధారంగా విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నాం. ప్రస్తుతం వరిలో రెండు సన్న రకాల విత్తనాలు, పెసరలో రెండు రకాలు, ఇనుములో ఒక రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచాం. రైతుల వినియోగాన్ని బట్టి అందుబాటులో ఉంచుతాం. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని షరుతుల ఆధారంగా వరి విత్తనాలకు డిస్కౌంట్ ఇస్తున్నాం. అంతేగాక విత్తన విక్రయాలకు డీలర్ల నుంచి దరఖాస్తులను కూడా ఆహ్వానిస్తున్నాం. వివరాలకు విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

–ఎస్.భిక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ

అలరించిన 'అనశ్వరం'


'అనశ్వరం'నాటికలో సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో విజయవాడలోని శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన 'అనశ్వరం'నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. సమాజ మార్పు అంశంగా బర్రె సత్యనారాయణ రచించిన ఈ నాటికకు ద్వాదశి వెంకటచంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. వైద్య వృత్తితో వ్యాధులు నయం చేయటమే గాకుండా సమాజంలో ఆత్మహత్యలు జరగకుండా చైతన్యం కలిగించేందుకు కూడా తమ వృత్తి ఉండాలని వైద్యుల తపనపై, అనాగరికులను నాగరికులుగా మార్చటం, అనాథలకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి పాల్పడటం లక్ష్యంగా రూపొందించిన నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కార్పొరేటర్ కమర్తపు మురళి, కార్యక్రమ అతిథి బత్తినేని నీరజ మాట్లాడుతూ.. ఎక్కడా లేని విధంగా ఖమ్మంలో నెలనెలా వెన్నెల పేరిట నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. నిర్వాహకులు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి ప్రతి నెలా కార్యక్రమాన్ని నిర్వహించటం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో అమరజీవి అనాబత్తుల రవీంద్ర నాథ్ సాంస్కృతిక కళా సంస్థ(ఆర్క్స్) కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవి, ప్రజా నాట్యమండలి కార్యదర్శి వేముల సదానందం, నందిగామ కృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గాయకులు మంజుల నాయుడు, గణపతి రాజు, భిక్షం తదితరులు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఫాదర్స్ డే సందర్భంగా నాన్న ఔన్నత్యం తెలిపే పాటలు పాడారు.

హక్కుల సాధనకు పోరాటం


అభివాదం చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్, నంగారభేరి నేతలు

ఖమ్మంమామిళ్లగూడెం: గిరిజన హక్కుల సాధనకు ఢిల్లీ స్థాయిలో లడాయికి సిద్ధం కావాలని లంబాడి హక్కుల పోరాట సమితి – నంగార భేరి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు దాస్‌రాంనాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం ఐఎంఏ హాల్‌లో ఖమ్మం జిల్లా అధ్యక్షులు దశరథ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర అధ్యక్షులు రాజేశ్‌నాయక్, జాతీయ జనరల్ సెక్రెటరీ డాక్టర్ నరేందర్‌పవార్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభా బహిర్గతం చేయాలని, గిరిజనులు సాగుచేస్తున్న పోడు, లావణి భూముల సమస్యలు శాశ్వతంగా పరిష్కరించి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో , రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్, రాష్ట్ర కార్యదర్శులు గోవింద్‌నాయక్, కృష్ణనాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలునాయక్, పంతులునాయక్, రాష్ట్ర సీనియర్ నాయకులు అజ్మీర సమ్మయ్య, పలు జిల్లాల అధ్యక్షులు వీరేశ్‌నాయక్, సురేశ్‌నాయక్, రాథోడ్‌సూర్య, సైదానాయక్, నీలకంఠం, జంపానాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్‌ఆర్‌టీసీ ఈయూ నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న పాటి అప్పారావు

ఖమ్మంమామిళ్లగూడెం: టీజీఎస్‌ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ కౌన్సిల్ సమావేశం ఆదివారం గిరిప్రసాద్‌భవన్‌లో రీజియన్ అధ్యక్షుడు గుడిబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగినది. సమావేశంలో టీజీఎస్‌ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ అధ్యక్షుడిగా బూదాటి శ్రీనివాసరెడ్డి, రీజియన్ కార్యదర్శిగా పిల్లి రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుడిబోయిన శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు మాట్లాడారు. ఈ నెల 24న అన్ని సంఘాలతో సమావేశం హైదరాబాదులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బీజీ క్లైమేట్, బాగం హేమంతరావు మాట్లాడారు. కందుల భాస్కర్‌రావు, తిమ్మినేని రామారావు, అరుణకుమారి, తిమ్మినేని రామారావు, రామచంద్రరావు, దేశబోయిన జగన్నాథం, బేతంపూడి బుచ్చిబాబు, జి.ఎస్.రెడ్డి, వెంకన్న, రమేశ్, అరుణమ్మ, కవిత, జరీనాబేగం, లాల్బి తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. ఆదివారం కొందరు వ్యక్తులు సుందరయ్యనగర్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7 వేల నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదాలపై పర్యాటకులకు అవగాహన


పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం సందర్శనకు వచ్చిన పర్యార్యటకులకు అత్యవసర సమయంలో, ఆకస్మిక ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీం కోర్సు డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువతకు పాల్వంచలోని స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీం ద్వారా టెక్‌షోర్ ఇన్‌స్పెక్షన్ సర్వీసెస్, క్వాలిటీ అష్యూరెన్స్ – క్వాలిటీ చెక్స్‌తో పాటు డిప్లొమా ఇన్‌ఫైర్ – సేఫ్టీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. 60 రోజుల భోజన వసతి, రెసిడెన్షియల్ శిక్షణతో పాటు ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు. ఔత్సాహిక గిరిజన యువత గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ ప్రభాకర్‌రావు, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, ప్రసాద్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'నగ్నదేశం' కావ్య సంపుటి ఆవిష్కరణ


'నగ్నదేశం'కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: కవి, రచయిత, అనువాదకులు, చిత్రకారుడు సవ్యసాచి రచించిన కవితా సంపుటి 'నగ్నదేశం'పుస్తక ఆవిష్కరణ ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ టెండర్ రూట్స్ పాఠశాలలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కవి, కేంద్ర సాహిత్య అకాడమీ జరల్ కౌన్సిల్ సభ్యులు ప్రసేన్ మాట్లాడుతూ.. సవ్యసాచి కవిగా, అనువాదకునిగా రాణిస్తున్నారని తెలిపారు. పాత, కొత్త తరం కవులు రాస్తున్న 'సిగ్నేచర్ పోయమ్స్'ను ఆంగ్ల భాషలోకి అనువాదం చేయడానికి పూనుకున్నారన్నారు. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు, కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సవ్యసాచి సామాజిక కోణంలో కవిత్వాన్ని అందించటం అభినందనీయమన్నారు. విద్యావేత్త, కవి రవిమారుత్ మాట్లాడుతూ.. సవ్యసాచి మణిపూర్‌లో జరిగిన మారణహోమంలో స్త్రీని నగ్నంగా నడిబజార్‌లో ఊరేగించిన ఉదంతాన్ని తాను రాసిన కవితా సంపుటి 'నగ్నదేశం'లో వివరించారని తెలిపారు. కార్యక్రమంలో కవులు శ్రీరామకవచం సాగర్, అన్నవరం దేవేందర్, డాక్టర్ పోతగాని తదితరులు సవ్యసాచి రచనను అభినందించారు. కార్యక్రమంలో కవులు ఇబ్రహీం, నిర్గుణ్, సునంద, రాంకుమార్, శేషగిరి, వెంకటయ్య, అమృత వర్షిణి, జయరాజ్, ఆంజనేయులు, పి.వెంకటేశ్వర్లు, దేవ, రౌతు రవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవైభవం వచ్చేనా?

- పాల్వంచ నుంచి తరలిపోతున్న కర్మాగారాలు, కార్యాలయాలు
- అభివృద్ధిపై స్పష్టమైన హామీలేవి..?
- నూతనంగా ఏర్పడిన ఫోరం ఫర్ బెటర్ పాల్వంచ, నూతన విద్యుత్ ఉత్పాదన సాధన కమిటీలు


పాల్వంచ పట్టణ వ్యూ

పాల్వంచ: కొత్తగూడెం కార్పొరేషన్‌లో ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ అయిన పాల్వంచ విలీనం అయి డివిజన్‌గా ఏర్పడటంతో పాల్వంచ ప్రతిష్ట తగ్గిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్పొరేషన్ అయితే అనేక పరిశ్రమలు వచ్చే అవకాశంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ప్రభుత్వం, పాలకులు అనేక విధానాలుగా మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కొత్తగూడెం కార్పొరేషన్ లేని సమయంలోనే మండల కేంద్రంగా ఉన్న పాల్వంచలో నవభారత్, ఎన్‌ఎండీసీ, కేటీపీఎస్ వంటి కర్మాగారాలతో పాటు, కిన్నెరసాని రిజర్వాయర్, పర్యాటక కేంద్రం అభివృద్ధి వంటి అనేక ఉపాధి అవకాశాలకు పుట్టినిల్లుగా ఉండేది. రానురాను పాల్వంచ అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఉపాధి అవకాశాలు సన్నగిల్లి వేలాది కుటుంబాలు ఇక్కడి నుంచి తరలిపోతున్నాయి. కార్పొరేషన్‌లో విలీనమైన నేపథ్యంలో పాల్వంచకు తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని పాల్వంచ పట్టణ ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు కలిసి ఫోరం ఫర్ బెటర్ పాల్వంచ పేరుతో జేఏసీగా ఏర్పడ్డారు. ఇదిలా ఉండగా పాల్వంచలో మరో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఉద్యోగ, కార్మిక, ఇంజనీర్స్ సంఘాలు ఏకమై నూతన విద్యుత్ ఉత్పాదక సాధన కమిటీగా ఏర్పడ్డారు.

పాల్వంచ అభివృద్ధికి గొడ్డలి పెట్టు

రాష్ట్రానికి వెలుగులు పంచే కేటీపీఎస్‌ను 1967 దశకం నుంచి ఇక్కడే ఏర్పాటు చేసి కాలక్రమేణా దశల వారీగా 2,520 మెగావాట్లు అందించే స్థాయికి ఎదిగింది. అంతేగాక ఇనుముకు ముడిసరుకును అందించి నవభారత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారం, స్టీల్ ప్లాంట్ (ఎన్‌ఎండీసీ), నవభారత్ విద్యుత్ ఉత్పత్తి కర్మాగారం వంటి పరిశ్రమలు రూపుదిద్దుకున్నాయి. అంతేగాక కిన్నెరసాని రిజర్వాయర్, పర్యాటక కేంద్రాలు ప్రసిద్ధికెక్కాయి. గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, క్రీడా పాఠశాలలు వెలిశాయి. ఈ క్రమంలో పాల్వంచ అంటే పారిశ్రామిక కారిడార్‌గా గుర్తింపు రావడంతో పాటు ఇక్కడ అనేక కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కల్పవృక్షంగా ఉండేది. మండల కేంద్రం కాస్త రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, పంచాయతీ నుంచి ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ఐటీడీఏ, ట్రైబల్ కోర్టులు ఇక్కడికే వచ్చాయి. దీంతో సుమారు ఐదారు మండలాల ప్రజలు ఏపని కావాలన్నా ఇక్కడికే వచ్చేవారు. ఇక ఇదంతా పాత మాటగా మారిపోయింది. జిల్లాల పునర్విభజనతో రెవెన్యూ కేంద్రాన్ని కొత్తగూడెంలో కలిపేశారు. దీంతో ఆర్డీఓ కార్యాలయం, ఇరిగేషన్ ఈఈ, ఏటీడబ్ల్యూఓ కొత్తగూడెంలో కలిశాయి. ఇక ఐటీడీఏ, ట్రైబల్ కోర్టు భద్రాచలానికి మార్చారు. కాలం చెల్లిందనీ 720 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారాన్ని తొలగించారు. నష్టాల ఊబిని తట్టుకోలేక స్పాంజ్ ఐరన్ స్టీల్ ప్లాంట్‌ను ఎన్‌ఎండీసీకి అప్పగించగా అప్పటికీ నష్టాలు గట్టెక్కక పోవడంతో మూసివేతకు గురైంది. నవభారత్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సైతం నష్టాల కారణంగా ఉత్పత్తిని నిలిపివేశారు. ఫెర్రోఎల్లాయిస్ సైతం నష్టాలు ఉన్నాయని ప్రొడక్షన్ తగ్గించడంతో పాటు సిబ్బందిని తగ్గించారు. ఈ పరిణామాల కారణంగా కాల క్రమేణా ఇక్కడి ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కేటీపీఎస్ మూసివేత కారణంగా వేలాది మంది ఉద్యోగులు బదిలీ వేటుకు బలయ్యారు.

మార్కెట్ కుదేలు

ఇటీవల కాలంలో పాల్వంచ జనాభా 20 వేలకు తగ్గిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక్కడి ఉద్యోగులు, వారి కుటుంబాలతో సహా వెళ్లిపోవడంతో మార్కెట్ వెలవెలబోతోంది. వర్తక, వాణిజ్యాలు కుదేలయ్యాయి. ఇళ్లు ఖాళీగా ఉండటం, టూలెట్ బోర్డులు కలినిపిస్తున్నాయి. విమానాశ్రమం, ఎన్‌ఎండీసీ విస్తరణ, ఆటోనగర్ ఏర్పాటు ఊసేలేదు. ఇక్కడి వనరుల దృష్ట్యా మరో విద్యుత్ కర్మాగారానికి అవకాశం ఉన్నా ప్రభుత్వం సుముఖంగా లేదు. అంతేగాక పాల్వంచను కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలిపారు. ఇలాంటి పరిణామాలతో ప్రముఖులు కమిటీగా ఏర్పడ్డారు.

గతంలో హామీ ఇచ్చారు.



పాత ప్లాంట్ కూల్చిన సమయంలో మరో కర్మాగారం ఏర్పాటుకు అధికారులు, పాలకులు హామీ ఇచ్చారు. వనరులు మెండుగా ఉన్న నేపథ్యంలో మరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు థర్మల్ విద్యుత్ కేంద్రాలను నెలకొల్పవచ్చు. భవితారాల కోసం ఆందోళనలకు సిద్ధం కావాలి.

–జమ్ముల సీతారామిరెడ్డి, నూతన విద్యుత్ ఉత్పాదక కేంద్రం సాధన కమిటీ సభ్యులు

పాల్వంచ బ్రాండ్‌ను పెంచాలి..



పాల్వంచను కార్పొ రేషన్‌లో కలిపే క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదు. పాల్వంచ బ్రాండ్‌ను పెంచే విధంగా కృషి చేయాలి. రైల్వేలైన్‌కు అనుకూలంగా ఉన్న కరకవాగును పరిగణనలోకి తీసుకోవాలి. ఎయిర్‌పోర్ట్‌పై మరో సర్వే చేయాలి. అనేక సంస్థలను ఇక్కడే ఏర్పాటు చేసేలా హామీ ఇవ్వాలి.

–నూకల రంగారావు, ఫోరం ఫర్ బెటర్ పాల్వంచ వ్యవస్థాపక సభ్యులు

తండ్రికి కుమార్తె తలకొరివి


తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె

దమ్మపేట: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన కునుసోతు రామకృష్ణకు మూడు రోజుల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి కుమారులు లేకపోవడంతో బీటెక్ చదువుతున్న ఆయన పెద్ద కుమార్తె శ్రావిక తలకొరివి పెట్టాల్సి వచ్చింది. ఫాదర్స్‌డే రోజే తండ్రికి కుమార్తె అంత్యక్రియలు చేయాల్సిరావడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి గాయాలు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లెందు జగదాంబ సెంటర్‌కు చెందిన రమేశ్ సాహు కుమారుడు కార్తీక్ సాహు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో వైద్యుడిగా చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన బైక్‌పై కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు వెళ్తుండగా తొమ్మిదోమైలుతండా వద్ద ఎద్దు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. గాయపడిన కార్తీక్‌ను కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

యువతి అదృశ్యం

దమ్మపేట: కళాశాలకు వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని నాగుపల్లి గ్రామంలో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన యువతి (20) సతుపల్లి మండలంలోని గంగారంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఈ నెల 2న కళాశాలకు వెళ్లిన యువతి.. ఇంటికి తిరిగిరాలేదు. ఆమె కుటుంబ సభ్యులు పలుచోట్ల ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

భద్రాచలంటౌన్: భద్రాచలం బస్టాండ్‌లో పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి బాధితురాలికి ఆదివారం డీఎం అప్పగించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన పాఠకుల రిషిత.. తన ఫోన్‌ను భద్రాచలం డిపోకు చెందిన కొత్తగూడెం వెళ్లే బస్సులో పోగొట్టుకుంది. అదే బస్సులోని ప్ర యాణికులకు దొరకగా వారు ఫోన్‌ను భద్రాచ లం డీఎం అల్లం నాగేశ్వరరావుకు ఇచ్చారు. దీంతో ఆయన ఆ ఫోన్‌కి వచ్చిన ఫోన్ నంబర్ల ద్వా రా అది ఎవరి ఫోనో తెలుసుకొని, బాధితురాలు పాఠకుల రిషితకు ఫోన్‌ను అప్పగించారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన ఆటో, రేషన్ బియ్యం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని మణుగూరు పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటిలోని ఆదర్శనగర్ ఏరియా నుంచి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న సుమారు ఏడున్నర క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సీఐ నాగబాబు దాడి చేసి పట్టుకున్నారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి ఆటోను స్టేషన్‌కి తరలించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి ఆదివాసీలు తరలివస్తుంటారు. వారి మాటున మావోయిస్టులు రావచ్చుననే అనుమానంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు క్రాస్ రోడ్‌లలో తనిఖీలు చేపట్టారు.